JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 23-12-2025
Medchal - Malkajgiri | Tuesday 23-12-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 207 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 207 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





## న్యూజిలాండ్ లో చారిత్రాత్మక ఒప్పందం

- జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 22:

ప్రపంచ వాణిజ్య రంగంలో భారతదేశం మరో ప్రధాన దౌత్య విజయాన్ని సాధించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా కీలక ఒప్పందం కుదిరింది. భారతదేశంన్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ను సంయుక్తంగా ప్రకటించారు. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాన్ని పెంచడమే కాకుండా,

2 లో



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వీడ్కోలు పలికారు. శీతాకాల విడిది ముగించుకొని హకీంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి తిరుగు ప్రయాణమైన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.



## ఏడాది పెరిగిన నేరాలు

- జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22:

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరంలో నేరాలు పెరిగాయని సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. 2024 సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగిందని ఆయన తెలిపారు. 2024లో 28,626 కేసులు నమోదు కాగా, 2025లో 33,040 కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం 579 కిడ్నాప్ కేసులు... 1,224 పోక్సో కేసులు... 73 హత్యలు... 330 అత్యాచారాలు నమోదయ్యాయి. మహిళలపై నేరాలు గత ఏడాదితో పోలిస్తే 4 శాతం పెరిగినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది రూ. 20 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

2 లో



## రైటర్స్ కథపై ఆసక్తికర చర్చ

■ మోడీ తర్వాత ప్రధానిగా చంద్రబాబు

జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 22:

భారత రాజకీయాల్లో మోడీ తర్వాత ఎవరు? అనే ప్రశ్న ఎప్పుడూ ఆసక్తికరమే. అయితే, ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ ఇటీవల ప్రచురించిన కథనం ఈ చర్చను మరో మలుపు తిప్పింది. 2029 నాటికి ప్రధాని మోడీ వయస్సు 79 ఏళ్లకు చేరుతుందని, ఆ సమయంలో ఆయన క్రియాశీల రాజకీయాల నుండి తప్పుకుంటే వారసులెవరు అనే కోణంలో రాయిటర్స్ ఒక ఆసక్తికర విశ్లేషణను బయటపెట్టింది. రాయిటర్స్ అంచనా ప్రకారం, బిజెపిలో మోడీ తర్వాత అత్యంత శక్తివంతమైన నేతగా ఉన్న అమిత్ షా మొదటి వరుసలో ఉన్నారు. పార్టీ యంత్రాంగంపై ఆయనకున్న పట్టు, వ్యూహకర్తగా ఆయనకున్న గుర్తింపు దీనికి ప్రధాన కారణాలు. ఇక మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ పేరును కూడా రాయిటర్స్ పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం. అయితే, క్షేత్రస్థాయిలో అత్యంత ప్రజాదరణ పొందిన, హిందుత్వ బ్రాండ్ అంబాసిడర్ గా పేరుగాంచిన యోగి ఆదిత్యనాథ్ పేరును రాయిటర్స్ విస్మరించడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో వరుస విజయాలు సాధిస్తూ, మోడీ తర్వాత అంతటి ఫాలోయింగ్ ఉన్న నేతను కాదని ఫడ్నవీస్ పేరును తెరపైకి తేవడం వెనుక రాయిటర్స్ లాజిక్ ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.. ప్రధాని రేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పేర్లను ప్రస్తావించడం. ఒకవేళ 2029లో బిజెపికి స్పష్టమైన మెజారిటీ రాకుండా, ఎన్డీయే కూటమిలోని ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటే, అప్పుడు

...మిగతాది 2 లో



# గ్రేటర్ పై రేవంత్ గురి

■ ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫుల్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు
■ మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకుని ఇంకా ఫుల్ జోష్
■ రేవంత్ రెడ్డి ఇప్పటినుంచే గ్రేటర్ ఎన్నికలపై ఫోకస్
■ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 300 డివిజన్లు
■ రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేసి..ఎన్నికలకు వెళ్లాలనేది రేవంత్ రెడ్డి వ్యూహం
■ జనవరి నెలాఖరులో గ్రేటర్ నగారా మోగించాలని రేవంత్ ప్రణాళిక సిద్ధం చేసినట్లు టాక్
■ ఎంఐఎం పార్టీతో దోస్తీ మరింత కలసి వస్తుందని భావిస్తోందట అధికార పార్టీ

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22 :

సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు గేర్ మారుస్తున్నారు. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వరకు కాస్త స్లోగా..నెమ్మదిగా వెళ్లినట్లు కనిపించిన ముఖ్యమంత్రి.. ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫుల్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు. వెంటనే పంచాయతీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మూడు విడతల్లో పల్లెపోరును కంప్లీట్ చేశారు. మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకుని ఇంకా ఫుల్ జోష్‌లోకి వచ్చారు. ఈ క్రమంలో రాజకీయంగా వేగంగా పావులు కదుపుతున్నారు. పొలిటికల్ ఈక్వేషన్స్‌ను తనకు అనుకూలంగా మార్చుకుంటూ..ఒక్కో స్టెప్ ముందుకేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల గెలుపుతో..గ్రేటర్ ఎన్నికలపై దృష్టి పెట్టారట సీఎం. తెలంగాణకు ఆర్థికంగానే కాదు.. రాజకీయంగా కూడా..హైదరాబాద్ గుండెలాంటిది. అయితే హైదరాబాద్‌లో గత

...మిగతాది 2 లో

## కాళేశ్వరం కూలిపోవడానికి కేసీఆరే కారణం



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22:

దాదాపు రెండేళ్ల తరువాత తెలంగాణ మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జలవనరులను సద్వినియోగం చేసుకోలేదని, పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. కేసీఆర్ వ్యాఖ్యలపై, బీఆర్ఎస్ పాలనపై ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 10 పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్, రాష్ట్రంలో కీలకమైన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు.పదేళ్ల సుదీర్ఘ పాలనలో కేసీఆర్ పాలమూరురంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, డిండి వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో సమాధానం చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యంగా

...మిగతాది 2 లో



## కేసీఆర్ కు రేవంత్ కు పోలికా

■ దమ్ముంటే చర్చకు రండి

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22:

కేసీఆర్ లేవనెత్తిన ప్రాజెక్టుల అంశాలకు సమాధానం చెప్పలేక, రేవంత్ రెడ్డి తన చిట్ చాట్ రాజకీయాలతో తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నేత హరీష్ రావు మండిపడ్డారు. కేసీఆర్ ఒక స్టేట్స్ మన్ లాగా రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడితే, రేవంత్ రెడ్డి ఒక స్ట్రీట్ రౌడీ లాగా అత్యంత హీనమైన భాషలో మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్ నిర్వహించిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి గతంలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని అనుమతులు సాధిస్తే, ప్రస్తుత ప్రభుత్వం డీపీఆర్ వాపస్ తెచ్చుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 టీఎంసీలు చాలు అని ఢిల్లీకి లేఖ ఎందుకు రాశారు ఇది పాలమూరు

...మిగతాది 2 లో

## కాంగ్రెస్ పార్టీలో పంచాయతీ సెగ



■ 16 మంది ఎమ్మెల్యేలపై సీరియస్..!!

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22:

తెలంగాణలో ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు విజయోత్సాహాన్ని ఇచ్చినా, మరోవైపు అంతర్గత లోపాలను ఎత్తిచూపాయి. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును నిరూపించుకోవాల్సిన ఈ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంపై ఏఐసీసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా సొంత నియోజకవర్గాల్లో పట్టు కోల్పోయిన 16 మంది ఎమ్మెల్యేలపై హైకమాండ్ ఆగ్రహం వ్యక్తం చేయడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఢిల్లీ నుంచి పార్టీ హైకమాండ్.. రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లతో అత్యవసర టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ చర్చల్లో ప్రధానంగా 16 మంది ఎమ్మెల్యేల పనితీరుపై చర్చ జరిగినట్లు సమాచారం. అధికారంలో ఉండి కూడా సగం స్థానాలకే పరిమితం కావడం చెంపపెట్టు వంటిదని అధిష్టానం అభిప్రాయపడింది. కనీసం 80 శాతం స్థానాలను గెలుచుకుంటేనే అది అసలైన అధికార బలమని హైకమాండ్ స్పష్టం చేసింది.చాలా చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పార్టీ నేతలే రెబెల్స్‌గా బరిలోకి దిగారు. వీరిని బుజ్జగించడంలో లేదా దారికి తెచ్చుకోవడంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ లు విఫలమయ్యారని పార్టీ గుర్తించింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచామన్న ధీమాతో క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని, ఓటర్ల నాడిని పట్టించుకోకపోవడం

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## న్యూజిలాండ్ లో చారిత్రాత్మక ఒప్పందం

అమెరికా రక్షణాత్మక వాణిజ్య విధానాల నేపథ్యంలో భారత్ ప్రత్యామ్నాయ ప్రపంచ భాగస్వామ్యాలను కూడా బలోపేతం చేస్తుంది.భారతదేశం - న్యూజిలాండ్ మధ్య FTAపై చర్చలు మార్చి 2025లో ప్రధానమంత్రి లక్సన్ భారతదేశాన్ని సందర్శించినప్పుడు ప్రారంభమయ్యాయి. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కేవలం 9 నెలల్లోనే పూర్తి చేయడం,రెండు దేశాల మధ్య రాజకీయ సంకల్పం,వ్యూహాత్మక అవగాహనను ప్రదర్శిస్తుంది. FTA అమలు తర్వాత వచ్చే ఐదు సంవత్సరాలలో ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని ఇద్దరు ప్రధానులు అంగీకరించారు. ఇది భారతదేశం - న్యూజిలాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడి, ఆవిష్కరణ, వస్తువుల సరఫరా సహకారానికి కొత్త ఊపును అందిస్తుంది.ఈ ఒప్పందం ప్రకారం, న్యూజిలాండ్ రాబోయే 15 సంవత్సరాలలో భారతదేశంలో 20 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుంది. ఈ పెట్టుబడి వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఆహార ప్రాసెసింగ్, విద్య, సాంకేతికత, స్టార్టప్‌ల వంటి రంగాలలో అవకాశాలను సృష్టిస్తుంది. ఇక FTA అమల్లోకి వచ్చిన వెంటనే భారత్ నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లే 100% ఎగుమతులపై జీరో డ్యూటీ వర్తించనుంది. దీని వల్ల రైతులు, MSMEs, కార్మికులు, కళాకారులు, మహిళా వ్యాపారాలు, యువతకు లాభం చేకూరుతుంది. వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, లెదర్, ఫుట్‌వేర్ వంటి కార్మికాధారిత రంగాలతో పాటు, ఇంజినీరింగ్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, కెమికల్స్ రంగాలకు కూడా పెద్ద అవకాశాలు లభించనున్నాయి. భారతదేశం ఏడవ ప్రధాన FTA, గ్లోబల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తుంది. న్యూజిలాండ్‌తో ఈ ఒప్పందం గత కొన్ని సంవత్సరాలలో భారతదేశం ఏడవ ప్రధాన FTA. గతంలో, భారతదేశం ఒమన్, UAE, UK, ఆస్ట్రేలియా, మారిషస్, EFTA (యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ బ్లాక్) దేశాలతో ఇలాంటి ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ సిరీస్ భారతదేశం విశ్వసనీయ ప్రపంచ వాణిజ్య కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.ఈ అగ్రిమెంట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రధాని నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ నేతృత్వంలో, న్యూజిలాండ్ మంత్రి టాడ్ మెక్‌క్లేతో సన్నిహిత సహకారంతో ఈ FTA పూర్తయిందని పీయూష్ గోయల్ తెలిపారు. ఇది ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక మైలురాయి అని అన్నారు. ఇదే భారత్ ఎగుమతులకు భారీ ఊరట అని పేర్కొన్నారు. పండ్లు, కూరగాయలు, కాఫీ, మసాలాలు, ధాన్యాలు, ప్రాసెస్డ్ ఫుడ్స్‌కు న్యూజిలాండ్ మార్కెట్‌లో కొత్త అవకాశాలు తెరుచుకుంటాయి. అగ్రికల్చరల్ ప్రొడక్టివిటీ పార్ట్‌నర్‌షిప్, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, న్యూజిలాండ్ ఆధునిక వ్యవసాయ సాంకేతికతల ద్వారా రైతుల ఆదాయం, ఉత్పాదకత పెరగనుంది. తేనె, కివీఫ్రూట్, ఆపిల్స్ వంటి హార్టికల్చర్ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రోత్సాహం ఉంటుంది. దేశీయ సున్నిత అంశాలను దృష్టిలో పెట్టుకుని, డెయిరీ, షుగర్, కాఫీ, మసాలాలు, ఎడిబుల్ ఆయిల్స్, బంగారం-వెండి, కాపర్, రబ్బర్ ఆధారిత ఉత్పత్తులకు రక్షణ కల్పించినట్టు గోయల్ స్పష్టం చేశారు. IT, ఫైనాన్స్, విద్య, టూరిజం, నిర్మాణ రంగాలకు కొత్త ద్వారాలు తెరుచుకుంటాయి. హెల్త్, సంప్రదాయ వైద్యం, స్టూడెంట్ మొబిలిటీ, పోస్ట్‌స్టడీ వర్క్‌పై న్యూజిలాండ్ తొలిసారి ప్రత్యేక అనెక్సులు చేర్చింది. 5,000 తాత్కాలిక ఉద్యోగ వీసాలు, వర్కింగ్ హాలిడే వీసాలు, పోస్ట్‌స్టడీ వర్క్ మార్గాలతో భారత యువతకు గ్లోబల్ అవకాశాలు విస్తరించనున్నాయి. ఈ భారత్-న్యూజిలాండ్ FTA ద్వారా ద్వైపాక్షిక ఆర్థిక భాగస్వామ్యం మరింత బలపడుతూ, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు ఇది కీలక అడుగుగా మారనుందని పీయూష్‌గోయల్ స్పష్టం చేశారు.

## ఏడాది పెరిగిన నేరాలు

డ్రగ్స్ కేసుల్లో మొత్తం 668 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 21,056కేసులను పరిష్కరించినట్లు సీపీ తెలిపారు. 12కేసుల్లో దోషులకు 20 ఏళ్ల జైలు శిక్ష పడిందన్నారు.సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామని అన్నారు. సైబర్ క్రైమ్ బాధితులకు రూ.40.10కోట్లను రిఫండ్ చేసినట్లు వెల్లడించారు. డ్రగ్స్ రవాణా చేస్తున్న 495 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన వారు 322 మంది, ఇతర రాష్ట్రాల వారు 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నట్లు తెలిపారు.

## గ్రేటర్ పై రేవంత్ గురి

అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీని కూడా గెలువలేకపోయింది కాంగ్రెస్. అధికారంలోకి వచ్చిన తర్వాత..ఎమ్మెల్యేల మరణంతో వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించి..గ్రేటర్‌లో రెండు సీట్లను తమ ఖాతాలో వేసుకోగలిగింది హస్తం పార్టీ. అటు పంచాయతీ పోల్స్, ఇటు రెండు బైఎలక్షన్లలో గెలుపు..ఇదే ఊపుతో గ్రేటర్‌లో పాగా వేసేలా పావులు కదుపుతోంది కాంగ్రెస్ పార్టీ.జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 150 డివిజన్లున్నాయి. అయితే పెరుగుతున్న జనాభా..నగర విస్తరణ.. ఇప్పటికే మెర్జ్ అయిన మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల జనాభాను దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంటుంది రేవంత్ సర్కార్. ఔటర్ రింగ్ రోడ్ వరకు..గ్రేటర్‌ను విస్తరించాలని డిసైడ్ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 300 డివిజన్లు కానున్నాయి. ఈ డివిజన్ల ఏర్పాటు కూడా తుది దశకు చేరుకుంది. డివిజన్ల ఏర్పాటు పూర్తవగానే..రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేసి..ఎన్నికలకు వెళ్లాలనేది రేవంత్ రెడ్డి వ్యూహం అంటున్నారు.ఇంతలోపు గ్రేటర్ అభివృద్ధి ఫోకస్ చేస్తూ...ఎన్నికలకు వెళ్లాలన్నది రేవంత్ ఆలోచనగా కనిపిస్తోంది. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ కావడం..మెట్రో విస్తరణ, ముఖ్యంగా పాతబస్తీకి మెట్రో..ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ డెవలప్ మెంట్ కారిడార్..ఇలాంటి అంశాలపై రేవంత్ రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. దీంతో నగరవాసుల్లో కాంగ్రెస్‌పై పాజిటివిటి పెరిగిందని భావిస్తున్నారట కాంగ్రెస్ లీడర్లు. దీంతో పాటు వచ్చే నెలలో దావోస్ పర్యటనతో సీఎం రేవంత్ పెట్టుబడులు తీసుకొస్తారని అంచనా వేస్తున్నారు. ఇక ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీ పాలక మండలి పదవి కాలం ముగుస్తుండటంతో..జనవరి నెలాఖరులో గ్రేటర్ నగారా మోగించాలని రేవంత్ ప్రణాళిక సిద్ధం చేసినట్లు టాక్. ఇక అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమం ఇవన్నీ ఒక ఎత్తు అయితే..ఎంఐఎం పార్టీతో దోస్తీ మరింత కలిసి వస్తుందని భావిస్తోందట అధికార పార్టీ. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాల్లో ముస్లిం ఓట్లు తమకు కన్వర్ట్ కావడంతో పాటు..ఎంఐఎంతో కలిసి గ్రేటర్ పీఠాన్ని సొంతం చేసుకోవచ్చనేది రేవంత్ ఈక్వేషన్ అంటున్నారు.ఒకవైపు పంచాయతీ ఎన్నికల్లో గెలుపు, జూబ్లిహిల్స్‌లో విక్టరీ, గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌తో... ఇదే సరైన సమయంగా భావిస్తున్న రేవంత్ రెడ్డి...గ్రేటర్‌తో పాటు..మరికొన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని ఎత్తులు వేస్తున్నారట. ఆ తర్వాత..ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా చెబుతున్నారు. రేవంత్ గ్రేటర్ వ్యూహం ఎంత వరకు వర్కౌట్ అవతుందో చూడాలి.

## రైటర్స్ కథపై ఆసక్తికర చర్చ

దక్షిణాది నేతగా చంద్రబాబుకు అవకాశం దక్కవచ్చని రాయిటర్స్ అభిప్రాయపడింది. కానీ ఇక్కడ కొన్ని ప్రాథమిక వాస్తవాలను రాయిటర్స్ విస్మరించినట్లు కనిపిస్తోంది. 2029 నాటికి మోడీకి 79 ఏళ్లు వస్తాయని ఆయనను పక్కన పెడితే, చంద్రబాబు కూడా అదే వయస్సులో ఉంటారు. వాస్తవానికి మోడీ కంటే చంద్రబాబు 6 నెలలు పెద్ద. వయస్సు రీత్యా మోడీ తప్పుకుంటే, అంతకంటే పెద్దవారైన చంద్రబాబును బిజెపి అగ్రనాయకత్వం ఎలా అంగీకరిస్తుంది?. జాతీయ రాజకీయాల్లో బిజెపి నేడు అత్యంత శక్తివంతంగా ఉంది. గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్ వంటి హేమాహేమీలను కాదని, ఒక ప్రాంతీయ పార్టీ నేతకు ప్రధాని పీఠాన్ని అప్పగించే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు.చంద్రబాబు కానీ, లోకేశ్ కానీ ఏనాడూ తమకు ప్రధాని కావాలనే ఆకాంక్ష ఉన్నట్లు ఎక్కడా వ్యక్తం చేయలేదు. "నా దృష్టి అంతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పైనే" అని చంద్రబాబు పలుమార్లు స్పష్టం చేశారు. లోకేశ్ కూడా రాష్ట్ర రాజకీయాల్లో నే తన ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ వర్గాల్లో సాగుతున్న ప్రచారం ప్రకారం.. 2029లో కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తే, చంద్రబాబుకు జాతీయ స్థాయిలో గౌరవప్రదమైన రాష్ట్రపతి లేదా గవర్నర్ వంటి పదవులు దక్కవచ్చని, ఆ సమయంలో రాష్ట్ర బాధ్యతలను లోకేశ్ కు అప్పగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. 'ప్రధాని పదవి' అనేది మాత్రం అతిశయోక్తిగానే తోస్తోంది.అంతర్జాతీయ మీడియా సంస్థలు ఒక్కోసారి క్షేత్రస్థాయి సమీకరణాలను వదిలేసి, కేవలం గణాంకాలు లేదా పాత రాజకీయ ముద్రల ఆధారంగా విశ్లేషణలు చేస్తుంటాయి. రాయిటర్స్ కథనం కూడా ఆ కోవలోకే వస్తుంది. దక్షిణాదిలో టీడీపీకున్న పట్టును గుర్తించిన రాయిటర్స్, దేశ ప్రధాని పదవి విషయంలో మాత్రం భారతీయ రాజకీయాల్లోని 'వయస్సు పరిమితులు', 'బిజెపి అంతర్గత పట్టు' వంటి కీలక అంశాలను సరిగ్గా అంచనా వేయలేకపోయిందనిపిస్తోంది. ఏది ఏమైనా, 2029కి ఇంకా చాలా సమయం ఉంది. పైగా తాను తప్పుకుంటానని మోడీ ఇంతవరకూ ప్రకటించలేదు. పార్టీ కూడా ఆయన్ను తప్పించే ఆలోచనలో లేదు. అయినా అప్పటి రాజకీయ పరిస్థితులు, బిజెపి బలాబలాలను బట్టి ఈ సమీకరణాలు ఎటువైపు అయినా మారవచ్చు.

# రాష్ట్రాలపై ఉపాధి భారం



జి రామ్ జి బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఇది చట్టం కాబోతున్నది. అయితే సరికొత్త చట్టం కాదు. ఇప్పటికే ఇది అమలులో ఉన్నది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 గా నిన్నటి వరకు అమలులో ఉన్నది. రాష్ట్రపతి ఆమోదంతో కొత్త పేరు అమలులోకి వస్తుంది. అందులో ఏ అంశాలున్నాయనే విషయం పెద్దగా చర్చించాల్సిన అవసరం లేదు. గ్రామాలలో ఉన్న పేదలకు ప్రత్యేకించి వ్యవసాయ కూలీలకు ఈ చట్టం ఉపాధిని కల్పిస్తున్నది. దాని మీద చర్చలు ఎన్నో జరిగాయి. విమర్శలు, ప్రతి విమర్శలు మరెన్నో వచ్చాయి. అయితే నిరుపేదలకు ఈ చట్టం ఎంతో మేలు చేస్తుందనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఈ చట్టంలో గతంలో ఉన్న ముఖ్యమైన అంశం మారిపోతున్నది. అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా విషయం. గతంలో ఈ పథకం బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే. కానీ కొత్త చట్టం ద్వారా ఖర్చులో రాష్ట్రాలపై భారం మోపనున్నది. బడ్జెట్‌లో 60 శాతం కేంద్రం నుంచి, 40 శాతం రాష్ట్రాలు భరించాల్సి ఉంది. ఇంకా కూలీల శ్రమ యంత్రాల వాడకం పైన కూడా కొన్ని నిర్ణయాలు చేశారు. అంతేకాకుండా అత్యంత ముఖ్యమైనది, కూలీల డిమాండ్‌ను బట్టి కాక, ప్రభుత్వాల నిర్ణయాలను బట్టి పనులను కల్పిస్తారు. గతంలో కనీసం వంద రోజుల పని దినాలను కల్పించాల్సి ఉంది. కాని దానిని 125 రోజులకు పెంచారు. ఇది కేవలం కంటితుడుపు మాత్రమే. కానీ ఈ రోజు రాష్ట్రాలు ఇందులో ఆర్థికంగా తమ బడ్జెట్‌లను వెచ్చించాలి. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వాటాను కల్పించకపోతే, ఆ పథకం అమలు సాధ్యం కాదు. ఇప్పటికే చాలా పథకాల్లో ఇటువంటి షరతులు విధించి, పథకాలనే నిలిపివేసిన ఘటనలున్నాయి. ఎస్సి, ఎస్టి, బిసి విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం అందులో భాగమే. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాలను వెచ్చించకపోవడం వల్ల కేంద్రం నిధులను విడుదల చేయడం ఆపేసింది. పంజాబ్ రాష్ట్రంలో ఈ స్కాలర్ షిప్స్ సమస్య ప్రభుత్వాన్నే మార్చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలను రేపు కూలీల ముందు దోషులుగా నిలబడే పరిస్థితి రాబోతున్నది. అంటే జి రామ్ జి పథకం రేపు రాష్ట్ర ప్రభుత్వాల నిస్సహాయతను బజారులో నిలబట్టే పరిస్థితి రాబోతున్నది. దానితో పథకమే ప్రశ్నార్థకం కాబోతున్నది. కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్నది కూడా అదే. క్రమంగా ఈ పథకాన్ని ఆచరణలో రద్దు చేయాలన్నదే ఉద్దేశం. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాలు తమ బడ్జెట్‌ల ద్వారా అమలులో ఉన్న పథకాలనే కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నాయి. ఉద్యోగుల జీతాలు, పెన్షన్‌లను సరైన సమయంలో చెల్లించలేని దీనస్థితిలో ఉన్నాయి. వాటికితోడు ఎన్నికల్లో గెలవడానికి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకోకుండా చేసిన వాగ్దానాలు రాష్ట్ర ప్రభుత్వాలకు గుదిబండలుగా మారిపోయాయి. వీటన్నింటిని నిర్వహించడానికి బ్యాంకులనుంచి అప్పులు తీసుకోవడానికి రిజర్వు బ్యాంకు అనుమతి కోసం విరామం లేకుండా ప్రయత్నిస్తున్నాయి. ఒక్కొక్క రాష్ట్రం తమ అప్పుల పరిమితులను దాటిపోయాయి. దీనితో చాలా రాష్ట్రాలు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవడానికి ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతున్నాయి. ఇది ఎక్కడి దాకా వెళ్తుందో తెలియదు. సరిగ్గా ఈ పరిస్థితిలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తమ బడ్జెట్ నుంచి నిధులను కేటాయించడమంటే అది వాస్తవ విరుద్ధమే అవుతుంది. ఇది మరింత సంక్షోభానికి దారి తీసే అవకాశముంది. అంతిమంగా ఈ పథకమే ఆగిపోయే పరిస్థితులున్నాయి. ఈ పథకాన్ని మొదటి నుంచి బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వ్యతిరేకత దృష్టితోనే చూస్తున్నది.కానీ, ఖర్చు గానీ ఏనాడు డిమాండ్‌కు తగ్గట్టుగా లేవు. దానికి తోడు కార్డులను తొలగించడం అనేది ఒక నిత్య కార్యక్రమంగా పెట్టుకున్నారు. గత రెండేళ్లలో దాదాపు 50 లక్షల కార్డులను దేశవ్యాప్తంగా తొలగించారు. అంతేకాకుండా ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి చేయాల్సినంత ప్రయత్నం చేశారు.

ఇప్పుడు ఈ చట్టం అంతిమ సమాధి. దీనికి బిజెపి సామాజిక నేపథ్యమే కారణం. ఈ పథకాన్ని గ్రామాల్లోని ధనిక, మధ్య తరగతి రైతులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిన తర్వాత కూలీలలో వేతనం డిమాండ్ పెరిగిందని, తమ పొలాల్లో పని చేయడానికి ముందుకు రావడం లేదని వాళ్లు వాదిస్తున్నారు. అంతేకాకుండా కూలీలలో పెరిగిన ఈ స్వేచ్ఛ గ్రామాల్లో వ్యవసాయ కూలీ పెరుగుదల అనివార్యమైందని, దానితో వ్యవసాయ ఖర్చులు పెరిగాయని రైతులు తమ వ్యతిరేకతను బహిరంగంగానే వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో ఈ వర్గమే బలమైనది. ఓట్లు గాని, ఇతర ఏ రాజకీయ ప్రయోజనాలకు గానీ ఈ వర్గమే ఆధారం. ఇది వర్గం, కులాల రీత్యా ఆధిపత్యం కలిగి ఉంది. అందువల్ల ఈ పథకానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టడమంటే ఆధిపత్య కులాలకు, వర్గాలకు అండగా నిలబడడమే. దీని వల్ల బిజెపి ఆధిపత్య కులాల్లో బలాన్ని స్థిరం చేసుకోవడానికి వీలవుతుంది. బెంగాల్‌లో నూటికి 50శాతం మంది ఎస్సిలు, ఎస్టిలు, ముస్లింలు ఉన్నారు. వీళ్లంతా భూమిలేని నిరుపేదలే. దాని వల్ల ఈ వర్గాలకు వ్యతిరేకింగా మధ్య తరగతి వర్గం కూలీలను సమీకరించే పనిలో పడ్డారు. అందుకే ఈ చట్టం ద్వారా మరో ప్రయోజనం పొందాలని పథకం వేశారు. అదే పేరు మార్పు. అందులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించి, రామ్ పేరును చేర్చడం రెండో ప్రయోజనం. ఎందుకంటే ఇక్కడ పరోక్షంగా ముస్లింల మీద వ్యతిరేకత రెచ్చగొట్టడం. మహాత్మా గాంధీ పేరును తొలగించడం వల్ల జరిగే చర్చలో పరోక్షంగా ముస్లింల విషయాన్ని చేర్చి తమకు అనుకూలంగా దీనిని మలుచుకోవడంలో సఫలీకృతం కావాలని ఆలోచన చేస్తున్నారు. మహాత్మాగాంధీ పైన బిజెపి, ఆర్ఎస్ఎస్ వర్గాలకు మొదటి నుంచి సదాభిప్రాయం లేదు. అది మహాత్మా గాంధీ హత్యతోనే బయట పడింది. మహాత్మా గాంధీని హత్య చేసిన నాథ్‌రామ్ గాడ్సే హిందూ మహాసభ నాయకుడు. ఆర్ఎస్ఎస్‌లో కూడా పనిచేశాడని చరిత్రలో ఉన్న విషయం. అదే విధంగా మహాత్మా గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్ శ్రేణులు మిఠాయిలు పంచుకున్నాయని అప్పటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ గోల్వాల్కర్‌కు రాసిన ఉత్తరంలో పేర్కొన్నారు. అంతేకాకుండా 2014లో అప్పటి బిజెపి ఎంపి సాక్షి మహారాజ్ నాథ్‌రామ్ గాడ్సే జాతీయ వీరుడు అని ప్రకటించారు. అదే విధంగా ఆర్ఎస్ఎస్ ప్రధాన నాయకుడు రాజ్‌భయ్యా నాథ్ గాడ్సేను సమర్థిస్తూ మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. అదే విధంగా నాథ్‌రామ్ గాడ్సేకు ఆశ్రయం ఇచ్చిన వాళ్లలో సావర్కర్ ప్రధానమైన వ్యక్తి. ఆయన అనేక సార్లు గాంధీని విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. అయితే గత కొన్ని రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ వీర్ సావర్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, తమ అనుబంధాన్ని చాటుకున్నారు. అయితే బిజెపి మహాత్మా గాంధీని ప్రత్యక్షంగా విమర్శించిన సందర్భాలు తక్కువ. అదే విషయాన్ని గత రెండు రోజుల క్రితం పార్లమెంట్‌లో ఆ పార్టీ ప్రకటించింది. మహాత్మా గాంధీ జయంతిని స్వచ్ఛ అభియాన్‌గా జరుపుకుంటున్న విషయాన్ని కూడా ప్రకటించారు. అది నిజమే. ఇక్కడ గమనించాల్సింది మహాత్మా గాంధీ మీద కోపం ఆయన మీద కాదు. ఆయన ఏ విధానాలను అవలంబించి ముస్లింలను సోదరులుగా చూడాలని ప్రకటించారో ఆ అంశం వాళ్లకు నచ్చదు. ఇప్పుడే ఈ విషయాన్ని లేవనెత్తి, పేరు మార్చడానికి రాబోయే బెంగాల్ ఎన్నికలే కారణం. అక్కడ ముస్లింల మీద వ్యతిరేకతను రెచ్చగొట్టి మిగతా సమాజాన్ని తమ వైపు తిప్పుకోవడానికి ఈ చర్చ వాళ్లకు అవసరం. భారత దేశంలో ముస్లింలు ఉండి హిందూ సమాజాన్ని అవహేళన, దాడులు చేస్తున్నారంటే మహాత్మా గాంధీ విధానాలే కారణమని బిజెపి చెప్పదలచుకున్నది. రాబోయేరోజుల్లో మహాత్మా గాంధీ సెక్యులరిజం, సర్వమత సమానత్వం అనే అంశాలమీద వాళ్లు కాకుండా, వివిధ వ్యక్తులతో మాట్లాడించి, ముస్లిం వ్యతిరేకతను తాము ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం చేస్తారు. జి రామ్ జి పేరును బాగా ప్రచారం చేయడం ద్వారా మరో ప్రయోజనాన్ని ఆశిస్తున్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం మీద విమర్శలు రాముని మీదికి మళ్లించి, వీళ్లంతా రాముని వ్యతిరేకులు, హిందూత్వ వ్యతిరేకులు అని చెప్పడం ద్వారా హిందూ భక్తులను కూడా ఇందులో భాగస్వాములను చేసి, దానిని సంఘటితం చేయాలనుకుంటున్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా వారి హిందూత్వ ఎజెండా ఉచ్ఛస్థాయికి చేరింది. ఇక వాళ్లు దేనిని సహించే స్థితిలో లేరు. అంతిమంగా హిందూత్వ భావాలను తమ ఎన్నికల ప్రయోజనాలకు వినియోగించుకొని ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. నూటికి ఇరవై మందిగా ఉన్న ఉన్నత ఆదాయ వర్గాలను తమ గుప్పిట్లో పెట్టుకోవడం వల్ల ప్రభుత్వాలను తారుమారు చేసే పథకాన్ని అమలు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పంచాయతీ సెగ

కొందరు ఎమ్మెల్యేలకు శాపంగా మారింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఉన్న ప్రాంతాల్లోనే సర్పంచ్ అభ్యర్థులు ఓడిపోవడం వారి ప్రాబల్యానికి గండికొట్టింది. గ్రూపు రాజకీయాలు పార్టీ మూలాలనే దెబ్బతీశాయని విశ్లేషణలు వస్తున్నాయి.ఓటమి పాలైన లేదా తక్కువ మెజారిటీ వచ్చిన నియోజకవర్గాల ప్రతినిధుల నుంచి సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ వివరణ కోరారు. "పార్టీ గీత దాటకుండా పని చేయాలి.. సమన్వయం లేకపోతే భవిష్యత్తులో కఠిన నిర్ణయాలు ఉంటాయి" అని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి అంటే క్షేత్రస్థాయిలో పునాదులు కదలడమేనని, ఇది రాబోయే మున్సిపల్ లేదా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని హైకమాండ్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.అధికార పార్టీకి సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యం ఉంటుంది. కానీ, ఈసారి 50 శాతం మార్కు దగ్గరే ఆగిపోవడం ప్రతిపక్షాలకు ఆయుధంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లడంలో లోపం ఉందా? అనే కోణంలో పార్టీ సమీక్షించుకోవాల్సి ఉంది. పీసీసీ చీఫ్ మారిన తర్వాత జరిగిన మొదటి కీలక ఎన్నిక కావడంతో, కేడర్‌ను ఏకతాటిపైకి తేవడంలో ఇంకా కసరత్తు అవసరమనిపిస్తోంది.మొత్తానికి, పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ శ్రేణులకు ఒక మేల్కొలుపు లాంటివి. హైకమాండ్ సీరియస్ అవ్వడం ద్వారా ఎమ్మెల్యేలపై పని ఒత్తిడి పెరిగింది. రానున్న రోజుల్లో ఈ 16 మంది ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపరుచుకోకపోతే, పార్టీలో క్రమశిక్షణ చర్యలు తప్పవనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 80 శాతం గెలుపు లక్ష్యాన్ని చేరుకోలేకపోవడం ద్వారా పార్టీ ఆశించిన క్లీన్ స్వీప్ కల నెరవేరలేదని చెప్పవచ్చు.

## కాళేశ్వరం.. కేసీఆరే కారణం

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజలు ఈ ప్రాజెక్టుల జాప్యంపై కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్ చెబుతున్నవన్నీ అవాస్తవాలని, సీఎంగా చేసిన వ్యక్తికి ఇలాంటి మాటలు తగవని హితవు పలికారు. నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పులు తెచ్చింది. కానీ రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తిస్థాయిలో పూర్తి చేయలేకపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టినందుకు కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కేసీఆర్ ఘోరంగా విఫలమయ్యారని, కృష్ణా జలాల విషయంలో పాలమూరు, నల్గొండ జిల్లాలకు తీరని అన్యాయం చేసింది BRS ప్రభుత్వమేనని మండిపడ్డారు.ప్రాజెక్టు బ్యారేజీలు కుంగిపోవడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణమని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణ తీరును నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో పాటు సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుబట్టారని ఆయన గుర్తు చేశారు.

కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచారని, కూలిపోయే ప్రాజెక్టులను కట్టిన కేసీఆర్ ఇప్పుడు ఇరిగేషన్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాలను కాపాడుకోవడంలో అత్యంత సమర్థంగా ముందుకు సాగుతోందని, రైతుల ప్రయోజనాల కోసం కృషి చేస్తుందని మంత్రి ఉత్తమ్ పునరుద్ఘాటించారు.కేంద్ర ప్రభుత్వం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ ను వెనక్కి పంపితే తెలంగాణ ప్రభుత్వం కనీసం నోరు విప్పడం లేదని, పోరాటం చేయలేదని కేసీఆర్ ఆరోపించారు. పైగా తమకు 45 టీఎంసీలు ఇప్పించాలని ఇరిగేషన్ మంత్రి కేంద్రానికి లేఖ రాయడం దారుణం అన్నారు. న్యాయంగా రావాల్సిన వాటాను దక్కించుకోలేని దద్దమ్మ ప్రభుత్వం, చేతకాని ప్రభుత్వం ఫార్మా సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని కేసీఆర్ ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ లేదు, తొక్కా లేదు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిజినెస్ మీట్స్ పెట్టి, ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయంటూ దొంగ లెక్కలు చూపి ప్రజలను తామెన్నడూ మోసం చేయలేదని కేసీఆర్ పేర్కొన్నారు.

## కేసీఆర్ కు రేవంత్ కు పోలికా

గొంతు కోయడం కాదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు వంటి ప్రాజెక్టుల ద్వారా దాదాపు 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందని, ఈ వాస్తవాన్ని అబద్ధాలతో కప్పిపుచ్చలేరని హితవు పలికారు.మహాలక్ష్మి పథకం కింద రూ. 2500, రైతు భరోసా, పెన్షన్ల పెంపు వంటి హామీలు ఏమయ్యాయని హరీశ్ రావు ప్రశ్నించారు. నిధుల సమీకరణలో అనుభవం ఉందని చెప్పుకునే రేవంత్ రెడ్డి, ఆ అనుభవాన్ని కేవలం లూటీలకు, దోపిడీలకు మాత్రమే వాడుతున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో లక్షల ఎకరాలకు ఆయకట్టు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చిందా అని సవాల్ విసిరారు. సాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ ప్రభుత్వం రోజుకు 10 వేల క్యూసెక్కుల నీరు తరలిస్తుంటే, రేవంత్ సర్కారు చేష్టలుడిగి చూస్తోందని ఎద్దేవా చేశారు.రేవంత్ రెడ్డి రాజకీయ చరిత్ర అంతా వెన్నుపోట్లమయమని, చొక్కాలు మార్చినంత సులభంగా పార్టీలు మార్చే ఆయనకు నైతికత గురించి మాట్లాడే హక్కు లేదని హరీశ్ రావు అన్నారు. 50 కోట్లు పెట్టి పీసీసీ పదవి కొన్నవని మీ పార్టీ నేతలే చెప్పారు. ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన దొంగవు నువ్వు అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రగతి గురించి టోనీ బ్లెయిర్ వంటి అంతర్జాతీయ ప్రతినిధులే ప్రశంసించారని, కానీ రేవంత్ మాత్రం రాజకీయాల కోసం రాష్ట్ర పరువు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెట్టిన కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టేందుకు పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తామని హరీశ్ రావు ప్రకటించారు. ఇప్పటికైనా 45 టీఎంసీలు చాలు అన్న లేఖను వెనక్కి తీసుకొని, 90 టీఎంసీల కోసం పోరాడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జల ప్రయోజనాల విషయంలో కేసీఆర్ ఏనాడూ రాజీపడలేదని, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి ద్రోహాన్ని ప్రజల ముందు ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

**దమ్ముంటే చర్చకు రండి**

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లునిజాలపై చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానిస్తే, కేసీఆర్ అసెంబ్లీకి వస్తారో లేదో చెప్పకుండా ఇదివరకు చెప్పిన మాటలే చెబుతున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో యూరియా కోసం రైతులు పడ్డ కష్టాలు పత్రికా సాక్ష్యాలుగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.గట్టిగా మాట్లాడినంత మాత్రాన అబద్ధాలు నిజం కావని ఆయన అన్నారు. అసెంబ్లీకి వస్తే ద్రోహి ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడారని, ఇప్పుడు అవే మాటలను కేసీఆర్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఏ రోజు కూడా సరైన పాలన అందించలేదని ఆయన అన్నారు. అందుకే ప్రజలు ప్రజా పాలనకు ఓటేశారని ఎంపీ అన్నారు.

# ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం

- గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం
- అభివృద్ధికి అందరం కట్టుబడి ఉంటాం
- డిజిటల్ నాగులపల్లిగా గ్రామాన్ని తీర్చిదిద్దుతాం
- నాగులపల్లి సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్ గౌడ్, వార్డు సభ్యులు; కల్పన, లక్ష్మీ నరసమ్మ, రజిత, సబిత, బౌరయ్య, స్వామి, కుమార్
- ప్రత్యేక అధికారి శైలజ ఆధ్వర్యంలో నూతన నాయకులను ప్రమాణ స్వీకారం చేయించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి శంకర్




**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 22 :**

పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన నాయకుల ప్రమాణస్వీకారం. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో నూతనంగా పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నాయకుల ప్రమాణ స్వీకారం ప్రత్యేక అధికారి శైలజ ఆధ్వర్యంలో నాగులపల్లి సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్ గౌడ్, వార్డు సభ్యులు; కల్పన, లక్ష్మీ నరసమ్మ, రజిత, సబిత, బౌరయ్య, స్వామి, కుమార్ లను గ్రామపంచాయతీ కార్యదర్శి హరిశంకర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ... నాయకులందరం కలిసి నాగులపల్లి గ్రామాన్ని అన్ని విధులుగా అభివృద్ధి దిశలో నడిపిస్తామని అన్నారు. అభివృద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉండి ప్రజల సంక్షేమం కోసం ప్రజల అభివృద్ధి కోసం కదం కట్టి పని చేస్తామని అన్నారు.



మా గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామని అన్నారు. ఇచ్చిన హామీలను సకాలంలో నెరవేర్చి డిజిటల్ నాగులపల్లిగా తీర్చిదిద్దడమే ముఖ్యదేయంగా పనిచేస్తామని అన్నారు. ప్రజల కోసం ప్రజల పక్షాన ఉండి అభివృద్ధి పనులలో అందరి సహాయ సహకారాలు తీసుకొని ముందుకు వెళ్తామని అన్నారు.

గ్రామంలో ఉన్న 8 వార్డులలో ప్రతి వార్డు అభివృద్ధి చెందేలా ప్రతి వార్డు సభ్యుడు అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల తక్షణ పరిష్కారం కోసం పూర్తిస్థాయిలో పనిచేసి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

ప్రజలందరినీ కలుపుకొని అందరితో కలిసి మెలిసి ఎలాంటి వివాదాలు విభేదాలు రాకుండా గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, అంగన్వాడి ఉపాధ్యాయులు, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు..

# కలిసి కట్టుగా అభివృద్ధి చేసుకుందాం

- ఎక్కువ నిధులిచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట:**




ఎన్నికలప్పుడే పార్టీలు ఉండాలి..ఎన్నికలయ్యాక అభివృద్ధి మాత్రమే జరగాలని, గ్రామాలను పార్టీలకతీతంగా కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. సోమవారం యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం, మాసాయిపేట,గౌరాయపల్లి,మల్లాపురం,వంగపల్లి గ్రామాల్లో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజాపాలన ద్వారా గ్రామాలకు ఎక్కువ నిధులు ఇచ్చి గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గత రెండేళ్లుగా గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలను వెంటనే పరిష్కరించి ముందుకెళ్లాలని సూచించారు. గ్రామాన్ని ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసుకొని వార్డుల వారీగా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని,తద్వారా పల్లెలన్ని అభివృద్ధిలో ముందుంటాయని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని ఎక్కువ సర్పంచ్ స్థానాలను గెలుపొందడం సంతోషంగా ఉందని,కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధితోనే సాధ్యమైందని తెలిపారు. గత ప్రభుత్వంలో నిధులు ఇవ్వక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా జరగకుండా గ్రామాలాభివృద్ధికి నిధులిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు తదితర సమస్యల పరిష్కారానికి త్వరగా కృషి చేసి,ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సభ్యులను ఆలేరు ఎమ్మెల్యే, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.






**అట్టహాసంగా ప్రమాణస్వీకారం..**

యాదగిరిగుట్ట మండలంలోని 23 గ్రామాల్లో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్ల ప్రమాణస్వీకారం అట్టహాసంగా సాగింది. రెండేళ్లుగా పాలకమండళ్లు లేకపోవడంతో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులకు ఘనస్వాగతం పలుకుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ప్రమాణస్వీకారం చేసిన ప్రజాప్రతినిధులకు పలు రాజకీయ పార్టీల నేతలు, గ్రామస్తులు తదితరులు అభినందనలు తెలిపారు.


# అఖిల భారత మహాసభలు జయప్రదం చెయ్యండి

- జాతా ప్రారంభించిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు

**జయభేరి, పరవాడ:**




సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని పరవాడ మండలంలో లంకెలపాలెం జంక్షన్, ఫార్మాసిటీ, తానం, పరవాడ, ఎన్ టి పి సి, సినిమా హాల్ జంక్షన్ లో జాతతో ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు జాతాను ప్రారంభించారు. జాతాను ఉద్దేశించి శంకర్రావు మాట్లాడుతూ సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయండి. సోమవారం లంకెలపాలెం జంక్షన్లో జాతాను ప్రారంభించారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నం వేదిక కానున్నాయని సిఐటియు ఆవిర్భవించి 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం మహాసభలకు వేదిక కానున్నదని. ఈ మహాసభలకు 2000 మంది ప్రతినిధులు అన్ని రాష్ట్రాల నుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి హాజరవుతారని. ఈ మహాసభల్లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం అవుతారని. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, బయటికి మేడిపండులా ఉన్న ఈ చట్టం లోపల కార్పొరేట్ కంపెనీలకి అనుకూలమైన విధానాల్ని అమలు చేస్తున్నారని. ఇప్పటివరకు ఉన్న హక్కుల్ని కాలరాస్తున్నారని. ఈనేపథ్యంలో జరుగు మహాసభల్లో ముగింపుగా జనవరి 4న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఈ మహాసభలు జయప్రదానికి కార్మికులు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ, కే వెంకట్రావు, ఏ రాజా, కే. వెంకు నాయుడు, కే రమణ పాల్గొన్నారు.



# నాది కానీ ఈ లోకంలో.. నేనెప్పుడూ ఒంటరి వాడినే...

**జయభేరి, హైదరాబాద్ :**

బంధాలు అనుబంధాలు, రక్త సంబంధాలు, ప్రేమానుబంధాలు ఇవన్నీ ఉన్నట్టే ఉన్న... ఏవి శాశ్వతం కాదని ఈ కాలం నాకు నేర్పింది.. నిజమైన స్నేహితుడు ఎవరని కాలాన్ని అడిగితే... కాలం నవ్వుతూ నాకు మించిన జ్ఞానవంతుడు మంచి స్నేహితులు ఇంకెవరుంటారు...!? అని బదులిచ్చింది.. ఒకరు పేరు, ప్రఖ్యాతుల కోసం, ఇంకొకరు కాసుల కోసం, మరొకరు ప్రేమ కోసం.., ఇలా ప్రతి ఒక్కరు ఏదో ఒక స్వార్థంతో అడుగు ముందుకేస్తారు.. అసలు స్వార్థం లేని వారెవ్వరూ...!? తల్లికి కొడుకుంటే ప్రాణం... భర్తకి భార్య అంటే ప్రాణమన్నమాటె కానీ ఎవరికోసం ఎవరు ప్రాణమిస్తారు....!? అంతా ఉట్టి భ్రమ... ఈ లోకపు నటన.. అందరూ నటసార్వభౌములే... నేల నింగి ఎప్పుడు కలిసినట్టే అనిపిస్తున్న కలవకుండా దూరంగా విడివిడిగా ఉంటూనే ఎంతో అనుబంధాన్ని ప్రేమను అల్లుకుంటున్న ఈ మనుషులకు అర్థం కావట్లేదు...!? నేల పై పువ్వులు పూస్తే నింగి మురిపిస్తుంది.. నింగి కారు మబ్బులు దాల్చి నేలను ముద్దులతో తడిపి అనుబంధాన్ని పంచుకోనగ.. భూమిపై నివసిస్తున్న జనాలు మాత్రం... ఆదేవుడు, ఈ దేవుడు అంటూ అటూ అడ్డుగోడలు కొట్టుకొని, కులమతాల కుంపటిలో నసించిపోతున్నారు కదా...!? ఏది శాశ్వతం కాదని తెలిసిన వాడే కదా నిజమైన విజ్ఞానవంతుడు... అంతా నాదే, అన్నీ నేనే నేనే గొప్ప, అనుకునే వాడే కదా నిజమైన మూర్ఖుడు.. జ్ఞానవంతులుగా ఉందామా మూర్ఖులుగా మిగిలిపోదామా.!? నిర్ణయించుకునేది మనమే....



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత



# నూతన నాయకులకు అభినందనలు

**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 22 :**

రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండల్ పాపిరెడ్డిగూడ గ్రామ నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్ల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరైన కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ శశిరేఖ యాదయ్య, డిప్యూటీ సర్పంచ్ తాండ్ర జ్యోతి మరియు వార్డ్ మెంబర్ లందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మన జాతిపిత మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆచరిస్తూ మన గ్రామాలలో త్రికరణశుద్ధితో పాలనను కొనసాగిస్తూ ముందుకు సాగాలని విన్నవించారు.

# క్రీడా రంగంలో ఉజ్వల భవిష్యత్తు




**జయభేరి, మేడ్చల్ :**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడా రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భారత ఖోఖో క్రీడాకారుడు వెంకటేశ్ అన్నారు. కిష్టాపూర్ డివిజన్లోని విభా స్కూల్లో ఛేజింగ్ డ్రీమ్స్, బ్రేకింగ్ బ్యారియర్స్ పేరటి వార్షిక క్రీడోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఖోఖో ప్లేయర్ వెంకటేశ్, కేంద్ర విద్యాలయాల రిటైర్డ్ డిప్యూటీ కమీషనర్ జగన్నాథరావు ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను క్రీడల్లో రాణించడం వల్లే భారత ఖోఖో జట్టు ప్లేయర్గా గుర్తింపు పొందానని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించానని వివరించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడలు, ఆటపాటలతో అలరించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎవిసి భారత్, సెక్రటరీ విష్ణుమూర్తి, ప్రిన్సిపల్ సంయుక్త నాగోజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కలిసి మెలిసి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి.. ప్రభుత్వ విప్




**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 22 :**

గెలిచిన సర్పంచులు వార్డు సభ్యులతో కలిసి మెలిసి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆలేరు ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం గంధ మల్ల, వాసాలమర్రి, తుర్కపల్లి గ్రామాల్లో నూతన సర్పంచుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా సర్పంచులు లేక గ్రామాల్లో అనేక పనులు పెండింగ్లో ఉన్నాయని, ఈ ప్రభుత్వంలో పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో, రేషన్ కార్డుల విషయంలో పార్టీలకతీతంగా, కులాలకు అతీతంగా అందజేస్తామని అన్నారు. ఎన్నికలు వచ్చేంత వరకే పార్టీలని తర్వాత అందరూ ఒకటేనని అన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు పోవాలని, ఎల్లవేళలా తను అందుబాటులో ఉంటారని, ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా సర్పంచులు కృషిచేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యత సర్పంచుల పైనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయిన చైతన్య మహేందర్ రెడ్డి ,గంధ మల్ల నూతన సర్పంచ్ బొత్త రాములు, తుర్కపల్లి నూతన సర్పంచ్ సోమొల్ల వెంకటేశం, వాసాలమర్రి గ్రామ నూతన సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, అధికారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తుర్కపల్లి మండలంలోని 33 గ్రామపంచాయతీలలో నూతన సర్పంచులుగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.





## వీరారెడ్డిపల్లిలో ఘనంగా గణిత దినోత్సవం

**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 22:**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టుల్లో వీరారెడ్డిపల్లి విద్యార్థులు తెలుగు మీడియం లో దొనికేనా అకిత్ కుమార్ ప్రథమ స్థానం, కొంతం మనోజ్ కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారి సత్యం, గణిత ఉపాధ్యాయుడు షేక్ బిక్కం సాహెబ్, సీనియర్ ఉపాధ్యాయుడు కచ్చి గళ్ళ మల్లయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ధనాత్మక ప్రదర్శనలు చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించి సంతోషం వ్యక్తం చేశారు.

## పిఎసిఎస్ ఇన్చార్జ్ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్



**తుర్కపల్లి, డిసెంబర్ 22 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఇన్చార్జిగా డిసిసిబి అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం పి ఎస్ సి ఎస్ పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేయడం వల్ల ఇన్చార్జి బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవోలు నారా రమేష్, బోరెడ్డి జనార్దన్ రెడ్డి, సిబ్బంది భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## శతశాతం పోలియో నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో గల సమ్మంగిపాలెం గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ప్రతి ఒక్క 5 ఏళ్ళ లోపు పిల్లలు అందరికి తప్పనిసరిగా పోలియా చుక్కలు వెయ్యించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు గుడాల ముత్యాలమ్మ, ఆశా కార్యకర్త, కణితి సత్యవతి, డ్వాక్రా సి ఐ కణితి సాయికుమారి, కూటమి నాయకులు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు, కణితి చిన సోమేశ్వరరావు, సమ్మంగి అప్పలరాజు, లాలం అప్పలనాయుడు, కోరంగి రాజు, సమ్మంగి మున్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన గ్రామ సర్పంచ్ గా వంగల స్రవంతి రమేష్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం ఉమ్మంతాలపల్లి లో బిజెపి బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్, ఉప సర్పంచ్ ముదిగొండ మంజుల అలువాలు మెడ మోని వెంకటమ్మ, ముదిగొండ ప్రశాంత్, ఇంద్రకంటి గోవర్ధన చారి మిగతా వార్డు సభ్యులు గ్రామపంచాయతీ భవనంలో అధికారులచే గ్రామస్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం చేసినారు. గ్రామ సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ మాట్లాడుతూ గ్రామంలో బొడ్రాయి పండుగ అందరి కులస్తులను కలుపుకుని ఒక కమిటీ ఏర్పాటు చేసి ఆరు మాసాలలో బొడ్రాయి పండుగ ఘనంగా నిర్వహించుకుంటాము, గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకుంటాము, స్కూల్లో బెంచిల్లు అవసరం ఉన్నాయని హెడ్మాస్టర్ మాకు తెలియజేసినారు త్వరలో బెంచులు కూడా ఏర్పాటు చేస్తామని గ్రామంలో ఏ సమస్యలున్న నేను తీర్చుతానని గ్రామస్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని గ్రామస్తుల సమక్షంలో తెలియజేసినారు.

## నూతన గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం కట్టాకోముతండా సర్పంచ్ గా నేనావత్ జ్యోతి పాండు నాయక్ ఉప సర్పంచ్ సబవత్ లక్ష్మి గోవింద్ నాయక్ కట్టాకొమ్ము తండా పాలక వర్గం సభ్యులను అధికారులు ప్రమాణ స్వీకారం మహోత్సవం నిర్వహించినారు. సర్పంచ్ నేనావత్ జ్యోతి పాండు మాట్లాడుతూ గ్రామ అవసరాలు తీరుస్తూ గ్రామంలో ఉంటూ గ్రామంలో ప్రజలకు ఏ ఇబ్బందులు తీరుస్తారని గ్రామస్తులకు తెలియజేసినారు.

# జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టుల నిరసన సక్సెస్

- అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకు జర్నలిస్టుల అరెస్టు తప్పలేదు
- జిహెచ్ఎంసిలో విజిలెన్స్ అధికారులు అవినీతిని ప్రోత్సహిస్తున్నారా.?
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి
- కమిషనర్ ను తప్పుతోవ పట్టిస్తున్న టౌన్ ప్లానింగ్ ఉన్నత అధికారులు
- మేము అవినీతి అక్రమాలు చేస్తే ఎవరు చర్యలు తీసుకోలేరని సవాల్ విసిస్తున్న సర్కిల్ అధికారులు
- అవినీతి అక్రమాలు చేసే అధికారులు సేఫ్.. ప్రశ్నించే జర్నలిస్టులకే బెదిరింపులు, అక్రమ కేసులు
- మార్పు రావాలి కాంగ్రెస్ రావాలి.. కాంగ్రెస్ వచ్చింది అవినీతి భారీగా పెరిగిపోయింది
- అవినీతి అక్రమాలపై మా పోరాటం ఆగదు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులు




**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22:**

జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను కట్టడి చేయాలని అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా జర్నలిస్టును బెదిరించడంతోపాటు దూషించిన ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు పై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులు ఏకమై సోమవారం ఉదయం 11 గంటలకు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. అవినీతి అక్రమాలపై రాసి రాసి అలసిపోతున్నామని ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో క్రింది స్థాయి ఉద్యోగులు, అధికారులు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోనల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ చర్యలు తీసుకోకుంటే ఇక ఎవరు చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు. ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు ఓ జర్నలిస్ట్ వివరణ కోరగా ఆయన బెదిరించడంతో పాటు, దూషించడం ఎంతవరకు సమంజసమని ఈ విషయం పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇదే కాకుండా అక్రమ నిర్మాణాలపై వార్తలు రాస్తున్న రిపోర్టర్ల పై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని అవినీతి అక్రమాలను కట్టడి చేయలేనప్పుడు మున్సిపల్ చట్టం ఎందుకని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలతో ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ హస్తవ్యస్తంగా మారిందని భవిష్యత్తులో పెను ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం అసలు విధులు నిర్వహించడం లేదా.? అందుకోసమే అక్రమ నిర్మాణాలు ఇలా పెరిగిపోతున్నాయన్నారు. అవినీతి అక్రమాలకు సపోర్ట్ చేసే అధికారులకు ఉన్నంత సపోర్ట్ అవినీతి అక్రమాలను ప్రశ్నించే ప్రజలకు రిపోర్టర్లకు లేదన్నారు. అక్రమాలు చేసి కోట్లు సంపాదించి ప్రశ్నించిన వారిపై అక్రమా కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిందని దీనిపై స్పందించవలసిన ప్రతిపక్ష నాయకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉండి ఎవరికి ఉపయోగమని ప్రభుత్వాన్ని ప్రజల ప్రక్షాళన ప్రశ్నించ లేనప్పుడు మరి ప్రతిపక్ష నాయకులు ఎలా అవుతారో వాళ్ళ విజ్ఞతకే తెలియాలి అన్నారు. ఈరోజు రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది జర్నలిస్టులేనని ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అవినీతి అక్రమాలను ప్రశ్నించి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**జర్నలిస్టుల అరెస్ట్..**

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులను అరెస్టు చేసి సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. జిహెచ్ఎంసిలో కోట్లల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని నిరసన వ్యక్తం చేసిన జర్నలిస్టులను అరెస్టు చేయడం సమంజసం కాదని దీనిపై ప్రభుత్వం స్పందించి వెంటనే పూర్తిస్థాయి విచారణ చేపించాలని ముఖ్యంగా ఏసీబీ అధికారులచే టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ అధికారుల తో పాటు డిప్యూటీ కమిషనర్ల అవినీతిపై ఏసీబీ విచారణ చేయాలని జర్నలిస్టులు కోరారు.

**అరెస్టులు ఖండిస్తున్నాం..**

**తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం..**

**భాగ్యనగర్ జర్నలిస్టు అసోసియేషన్..**

అవినీతి అక్రమాలను కట్టడి చేయమన్నందుకు జర్నలిస్టులను అరెస్టు చేయడం ఏమిటని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు, భాగ్యనగర్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్ ప్రశ్నించారు. మరి అధికారులు అవినీతి అక్రమాలు చేస్తే ఎవరు ప్రశ్నించాలని ప్రతిపక్షాలు చేయవలసిన బాధ్యత జర్నలిస్టులు చేస్తే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కి పడుతుందని ప్రశ్నించారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టిన జర్నలిస్టులను అరెస్టు చేసిన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ప్రభుత్వానికి చేతనైతే జర్నలిస్టులు రాసిన సమస్యలపై అవినీతి అక్రమాలపై ప్రభుత్వ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు.



## పరీక్ష ఫీజు ఆన్లైన్లో చెల్లించు కోవాలి

**జయభేరి, దేవరకొండ :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ (బి. ఎ, బీకాం, బీఎస్సీ) కోర్సుల్లో I ,III,V సెమిస్టర్ పరీక్ష ఫీజులను 27 12 2025 తేదీ లోపు ఆన్లైన్లో చెల్లించుకోవాలని మునగాల కొండల రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్, దేవరకొండ ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి సహాయ కేంద్రం121 కోఆర్డినేటర్ డాక్టర్ వి.మకట్లాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మరిన్ని వివరాలకు 7382929721 ఫోన్ నెంబర్ను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



**జయభేరి, చందంపేట :**

చందంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందంపేట యందు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భముగా జాతీయ గణిత దినోత్సవమును పురస్కరించుకొని చిత్రపటము కు పూలమాలలు వేసి గణిత ప్రదర్శనను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లీలా రాణి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ చిన్న వయసులోనే తన సొంత ఆలోచనలతో సిద్ధాంతములను కనుగొన్న అసాధారణ వ్యక్తి అని గణిత ప్రపంచంలో తనకంటూ ఒక ఉన్నత స్థానాన్ని నిలుపుకున్న మహా పురుషుడని 32 సంవత్సరాల చిన్న వయసులోనే మరణించారని ఈయన జయంతి సందర్భంగా దినోత్సవమును జరుపుకుంటామని తెలియచేసినారు. తదుపరి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో గోవిందు కొండయ్య రామచంద్రు విజయ ఎల్ మధు తదితర ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్ పేర్వాల రజిత జంగి రెడ్డి ప్రమాణ స్వీకారం



**జయభేరి, డిండి :**

డిండి మండలం వావిల్ కోల్ నూతన గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన పేర్వాల రజిత జంగారెడ్డి సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్యలు వచ్చినా నేను దగ్గరుండి తీరుస్తానని గ్రామస్తులకు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఓర్సు ముత్యాలు,ఓర్సు అంజయ్య ,మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, లక్ష్మీనారాయణ, శ్రీను, వెంకటేష్,సత్తిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, దామోదర్ రెడ్డి ,రామ్మోహన్ రావు ,యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

- ఘనంగా తీదేడు గ్రామ సర్పంచ్ గా ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం
- భారి విజయోత్సవ ర్యాలీ తీసిన తీదేడు గ్రామ బిఆర్ఎస్ బిజెపి టిడిపి మిత్ర పక్షాల నేతలు
- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, తీదేడు గ్రామ సర్పంచ్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం తీదేడు గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. తీదేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ఘనంగా ప్రమాణ స్వీకారం చేసారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు విషయంలో పక్షపాతం లేకుండా వ్యవహరిస్తమన్నారు. అనంతరం గ్రామ ప్రజలు సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డిని, గ్రామ పాలక వర్గం సభ్యులకు శాలువాలతో పూల మాలలతో ఘనంగా సన్మానించారు.అనంతరం సర్పంచ్ పాలక వర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య,దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,ధరణిపతి రమణారావు,సందె లక్ష్మయ్య,మర్ల యాదయ్య యాదవ్,శివర్ల పర్వతాలు యాదవ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిజెపి నాయకులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి స్కూల్ ను సందర్శించిన ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ దేవరకొండలో గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదిన శుభ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఏర్పాటుచేసిన మ్యాథమెటిక్స్ సెమినార్ కి దేవరకొండ ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్ ని ఆహ్వానించడం జరిగింది. ఈ యొక్క సెమినార్ ప్రదర్శనను చూసి ఆ విద్యార్థుల యొక్క నైపుణ్యాన్ని చాలా మెచ్చుకోవడం జరిగింది ప్రతి ఒక్క విద్యార్థిని కూడా ఈ సందర్భంగా రాము చోహన్ శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ సెమినార్ని ఉద్దేశించి రాము చౌహాన్ ఉపన్యాసం ఇవ్వడం జరిగింది ఆ ఉపన్యాసంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మీరందరూ ఒక ఐఏఎస్ ఒక ఐపీఎస్ అధికారులుగా బాగా కష్టపడి చదివి సాధించాలని ఆ విద్యార్థులకు వివరించడం జరిగింది ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా కొని యాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యక్రమానికి ఫంక్షన్ హాల్ బ్రేక్

**జయభేరి, రంగారెడ్డి:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనిల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈనెల 26వ తేదీన కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు శ్రీ గోదాకృష్ణ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం విషయంలో స్థానిక కార్పొరేటర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఫంక్షన్ హాల్ యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురి చేయడంతో ఆరోజు జరగవలసిన ఫంక్షన్ ను ఇక్కడ వద్దంటూ వారు చెప్పారని అన్నారు. తాము ఇప్పటికే నిర్వాహకులకు డబ్బులు సైతం అడ్వాన్స్ రూపంలో చెల్లించామని ఎమ్మెల్యే భయపెట్టడంతో ఇలా జరిగిందన్నారు. స్పీకర్ సైతం పార్టీ ఫిరాయింపుల పైన స్పందించి ఎమ్మెల్యే గాంధీ బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారని చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన తనతో పాటు కేటీఆర్ వస్తున్న సభకు వచ్చి చేరికలు భాగస్వాములు కావాలని సూచించారు. ఇలాంటి బెదిరింపులకు తాము భయపడమని ఎట్టి పరిస్థితుల్లో కేటీఆర్ సమక్షంలో భారీ ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు బిఆర్ఎస్ లో చేరుతారని వెల్లడించారు.

# సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గోల్లూరి అంజయ్య



జయభేరి, కాప్రా :

మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ కృష్ణనగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ కు సన్మాన కార్యక్రమం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సన్మాన కార్యక్రమ అనంతరం క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. గోల్లూరి అంజయ్య. ఈ కార్యక్రమము సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, టాస్కా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు ఎం.వి రామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ కు సంబంధించి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అనంతరం సీనియర్ సిటిజన్స్ కార్యవర్గం ఎమ్మెల్యేని, కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తొమ్మిది మంది సీనియర్ సిటిజన్స్ కి గౌరవ సన్మానం చేయడం జరిగింది.

మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కాలనీ అధ్యక్షులు మోర మల్లారెడ్డి, కేఎన్ఎస్సిడబ్ల్యుఏ మాజీ అధ్యక్షులు నర్ర సుఖేందర్ రెడ్డి, కేఎన్ఎస్సిడబ్ల్యుఏ ప్రధాన సలహాదారు పి. లక్ష్మారెడ్డి, హేమంత్ రెడ్డి, లయన్ పి.వి. రమణ, కేఎన్ఎస్సిడబ్ల్యుఏ ఉపాధ్యక్షులు అతిథులచే వేదికపైకి ఆహ్వానించబడ్డారు. కేఎన్ఎస్సిడబ్ల్యుఏ మరియు కాలనీ ప్రధాన కార్యదర్శి బి. దేవరాజ్ సంఘం చేపడుతున్న కార్యకలాపాలపై సమగ్ర నివేదికను సమర్పించారు.

ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం లయన్ అంజయ్య కృతజ్ఞతల తీర్మానాన్ని చేశారు. ఈ సమావేశంలో కేఎన్ఎస్సిడబ్ల్యుఏ ఆర్థిక కార్యదర్శి ఎం.ఎన్. కుమార్, ఉపాధ్యక్షులు ఏ. అంజయ్య తదితర సీనియర్ సిటిజన్స్ విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్‌గా లావణ్య శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం





జయభేరి, రేగొండ :

భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం, రామన్నగూడెం గ్రామ సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే నా లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారాలు అందించేలా పారదర్శక పాలన అందిస్తానని తెలిపారు. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, డ్రైనేజ్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తా అని హమీ ఇచ్చారు. అలాగే పేదలు, మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్క పేదవారికి న్యాయం జరగాలి. పేదవారి కళ్ళల్లో సంతోషం కనబడాలి. సర్పంచ్ అంటే ఇలా ఉండాలి అని నిరూపిస్తారని ఆశిస్తూ.. ప్రజల సహకారం ఉంటేనే గ్రామం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని పేర్కొన్న ఆయన, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులతో సమన్వయంతో పని చేసి రామన్నగూడెం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని భరోసా ఇచ్చారు. పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


# పంజా విసురుతున్న చలి డేంజర్ లో హైదరాబాద్ ఎయిర్

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22:



తెలంగాణలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రజలు గజగజా వణికిపోతున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోనే అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఐదు డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దాదాపు 15 జిల్లాల్లో 10డిగ్రీల సెల్సియస్ లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, అదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని అనేక మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. అయితే, తెలంగాణలోని మమంగళ, బుధవారాల్లో చలితీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.తెలంగాణపై చలి పులి పంజా విసురుతోంది. రికార్డు స్థాయి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో బయటకు రావాలంటే ప్రజలు వణికిపోతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు చలి ఎక్కువగా ఉన్న సమయాల్లో బయటకు రావొద్దని, ఒకవేళ వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలాఉంటే.. హైదరాబాద్ నగరంలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం చేరింది.దేశ రాజధాని ఢిల్లీ సహా ఇతర నగరాలకు ముప్పుగా మారిన వాయు కాలుష్యం తాజాగా.. హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టింది. భాగ్యనగర వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 255కు చేరుకుని ప్రమాదకర స్థాయికి చేరింది. ముఖ్యంగా బాలానగర్, సనత్ నగర్, జీడిమెట్ల, మల్లాపూర్ వంటి పారిశ్రామిక, రద్దీ ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రంగా ఉంది. శీతాకాలపు పొగమంచుకు తోడు వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం వల్ల గాలిలో సూక్ష్మ ధూళి కణాలు భారీగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సైనసైటిస్, డస్ట్ అలర్జీ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, ముఖ్యంగా ఉదయం వేళల్లో వ్యాయామాలకు దూరంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రాత్రిపూట రాష్ట్ర వ్యాప్తంగా 4.5 నుంచి 11.12 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతతో ఉదయం 8గంటల తరువాతే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. సంగారెడ్డి జిల్లాల్లో పదేళ్ల రికార్డు స్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలోని కోహీర్ లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4.5డిగ్రీలు నమోదైంది. గతేడాది ఇదే సమయంలో 17.8డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 4.8డిగ్రీలు నమోదైంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ పదేళ్లలోనే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఖమ్మం, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట మినహా మిగిలిన జిల్లాల్లో 10డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాల్లోనూ 11.2 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు రాత్రి, ఉదయం వేళ్లలో బయటకు రావొద్దని వైద్య నిపుణులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో కూడా ఈ ఏడాదిలోనే అత్యంత చలితీవ్రత నమోదైంది. నగరంలో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 10 డిగ్రీలుగా ఉన్నప్పటికీ.. జీహెచ్ఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇది ఇంకా తక్కువగా ఉంది. శేరిలింగంపల్లిలో 7.8డిగ్రీలు, మల్కాజిగిరి ప్రాంతంలో 8.3 డిగ్రీలు, రాజేంద్ర నగర్ ప్రాంతంలో 9.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.




## రోడ్డు ప్రమాదంలో ఏఆర్ఎస్ఐ మృతి

జయభేరి, మేడిపల్లి :

మేడిపల్లి పిఎస్ పరిధిలో ఫిర్యాదుదారుని (రాజేష్) తండ్రి జగ్గని రఘుపతి (59), ARSI, ISW, తెలంగాణలో విధులు నిర్వహిస్తూ ఉన్నారు. తేదీ 22.12.2025 నాడు, తన విధులలో భాగంగా మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో, జగ్గని రఘుపతి ఖైరతాబాద్ నుండి తన ద్విచక్ర వాహనం పై సింగపూర్ టౌన్‌షిప్ వైపు బయలుదేరారు. ప్రయాణంలో ఉండగా, మధ్యాహ్నం 13:30 గంటల సమయంలో, నారాపల్లి మసీదు సమీపానికి చేరుకున్నప్పుడు, వెనుక వైపు నుండి వచ్చిన ఒక టిప్పర్ డ్రైవర్ అతి వేగంగా మరియు నిర్లక్ష్యంగా నడుపుతూ, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఫలితంగా ఆ లారీ మృతుని తలపై నుంచి వెళ్లి పోవడంతో, అతడికి తీవ్రమైన గాయాలు కలిగి, స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటన గురించి అక్కడ ఉన్న వ్యక్తి ఫిర్యాదుదారునికి సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న వెంటనే ఫిర్యాదుదారు సంఘటన స్థలానికి చేరుకుని అప్పటికే తన తండ్రి చనిపోయినడు. ఈ విషయం పై కేసు నమోదు చేసి విచారణ ప్రారంబించడం జరిగింది.

## బాలుడు అదృశ్యం



జయభేరి, మేడిపల్లి :

మేడిపల్లి పిఎస్ పరిధిలోగల జయప్రద కాలనీ చెంగిచెర్లలో నివసించే బీహార్ కు చెందిన మీనాదేవి కుమారుడు అయినా రాజ్ కుమార్(09) గత నెలక్రితం ఇంటిముందు ఆడుకుంటూ తప్పిపోయినాడు అప్పటినుండి ఇంటికి తిరిగి రాలేదు. ఇట్టి విషయంపై వారి తల్లీ మేడిపల్లి పిఎస్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది. కావున అబ్బాయి ఎవరికైనా కనిపించిన మేడిపల్లి పిఎస్ వారికి సమాచారం ఇవ్వగలరు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ ప్రజాప్రతినిధులు



జయభేరి, మేడిపల్లి :

జిహెచ్ఎంసి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ చిల్కానగర్ రోడ్ లో జరుగుతున్న కల్వర్టు పనులను మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు భూక్య సుమన్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్ కలిసి పరిశీలించి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారుకు తెలియజేశారు.



## శ్రీనివాస టెక్స్టైల్స్ నీ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

జయభేరి, ఉప్పల్ :

నాచారం మెయిన్ రోడ్ వద్ద శ్రీనివాస శర్మ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస టెక్స్టైల్స్ నీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా నిర్వహకులు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీరవెల్లి సర్పంచ్‌గా తోటకూరి శంకరయ్య ప్రమాణ స్వీకారం



జయభేరి, భువనగిరి :

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లి గ్రామ సర్పంచ్‌గా తోటకూరి శంకరయ్య సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే నా లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారాలు అందించేలా పారదర్శక పాలన అందిస్తానని తెలిపారు. రోడ్లు,తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు,డ్రైనేజ్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తా అని హమీ ఇచ్చారు. అలాగే పేదలు, మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.ప్రజల సహకారం ఉంటేనే గ్రామం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని పేర్కొన్న ఆయన, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులతో సమన్వయంతో పని చేసి వీరవెల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## అద్భుతంగా జాతీయ గణిత దినోత్సవం



జయభేరి, మేడిపల్లి :

జాతీయ గణిత దినోత్సవాన్ని సందర్భంగా సోమవారం శ్రీనివాస రామానుజన్ జన్మదిన సందర్భంగా జడ్పీహెచ్ఎస్ బోడుప్పల్ మేడిపల్లి మండలం మేడ్చల్ జిల్లా యందు జాతీయ గణిత దినోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గణితం పట్ల ఇష్టతను పెంపొందించడానికి గాను ఉపాధ్యాయులు ఉపన్యాస పోటీలు, వ్యాసరచన పోటీలు, క్విజ్ కాంపిటీషన్ దళిత విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. అలాగే విద్యార్థులలో గణితం పట్ల భయాన్ని తొలగించడానికి ఈ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని.. క్విజ్ కాంపిటీషన్ చక్కగా అద్భుతంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రవికుమార్ సర్ మాట్లాడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రవికుమార్, గణిత ఉపాధ్యాయులు జి సత్యవతి, ఏ అనిల్ కుమార్, జి హనుమంతు అలాగే సహచర ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



## ఆలయ పుష్కరిణిలో ఇద్దరు చిన్నారుల మృతి

జయభేరి, శ్రీకాకుళం:

ఆలయ పుష్కరిణిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో చోటుచేసుకుంది.పట్టణంలోని 15వ వార్డు మోణింగి వారి వీధిలోని రామలింగేశ్వర పుష్కరిణి వద్దకు అదే వార్డులోని గణేష్ నగర్‌కు చెందిన సురవరపు పవన్ , శంఖం ధనుష్ ఆడుకోవడానికి వెళ్లారు. మెట్లపై ఆడుకుంటూ ధనుష్ ప్రమాదవశాత్తు జారి పుష్కరిణిలో పడిపోయాడు. ధనుష్‌ను కాపాడేందుకు వెళ్లి పవన్ కూడా మునిగిపోయాడు. దూరం నుంచి గమనించిన స్థానికులు అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి పుష్కరిణిలో దిగి చిన్నారులను బయటకు తీశారు. 108 సిబ్బంది సిపిఆర్ చేసినా ప్రయత్నం లేకుండా పోయింది. చిన్నారులు అప్పటికే మృతి చెందారు. ధనుష్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. పవన్ సాయి లక్ష్మీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. మృతదేహాలను కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్తుండడంతో పోలీసులు అభ్యంతరం తెలిపారు. ప్రమాద ఘటన కావడంతో పోస్టుమార్టానికి పంపించాలని కోరారు. కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు పోలీసుల మాటను తిరస్కరించి ఇళ్లకు తీసుకెళ్లారు.



# రాజమౌళి వారణాసి హాలీవుడ్‌లో?


సినిమాను తెరకెక్కించడంలోనే కాదు, దాన్ని ప్రమోట్ చేయడంలో.. మార్కెటింగ్ జరపడంలోనూ దిట్ట దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి. ప్రస్తుతం ఆయన అంతర్జాతీయ స్థాయిలో 'వారణాసి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు అంబరాన్ని తాకాయి. దీనికి తగ్గట్టుగా ఈ సినిమా బడ్జెట్ విషయంలో కూడా రకరకాల ఊహాగానాలు ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. 700కోట్ల బడ్జెట్ అని ఒకరంటే.. కాదు వెయ్యి కోట్లని మరొకరు. కానేకాదు 1500కోట్లని ఇంకొకరు. ఇలా ఈ సినిమా బడ్జెట్ విషయంలో చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. అయితే.. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమాకు నిర్మాత కె.ఎల్.నారాయణ అన్ లిమిటెడ్ బడ్జెట్‌ని కేటాయించారట. కథ డిమాండ్ మేరకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదనే పంథాలో ఆయన ముందుకెళ్తున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఖర్చు ఎంతైనా, దాన్ని రాబట్టుకోవడం రాజమౌళికి బాగా తెలుసు. అందుకే 'వారణాసి' హాలీవుడ్ వెర్షన్‌ని కూడా ఆయన సిద్ధం చేస్తున్నారట. హాలీవుడ్ ప్రేక్షకులకు 'వారణాసి' నచ్చితే.. ఆ అంకెలు వేరే విధంగా ఉంటాయని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్‌ఆర్‌ఆర్' ఆస్కార్ దాకా వెళ్లడంతో హాలీవుడ్‌లోనూ రాజమౌళి గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమా బిజినెస్ పూర్తయిన తర్వాతే పారితోషికాలు తీసుకోవాలని రాజమౌళి, మహేశ్‌బాబు భావించారట. దాంతో ప్రస్తుతం నిర్మాత ప్రతి పైసా సినిమాకే ఖర్చు చేస్తున్నట్టు తెలిసింది. ఏదేమైనా రాజమౌళి స్ట్రాటజీనే వేరు.

# సల్మాన్ ఖాన్ 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' టీజర్ ఆన్ ది వే..!



బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. వార్ డ్రామా వస్తోన్న ఈ సినిమాకు అపూర్వ లాఖియా దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. భారతదేశంచైనా సరిహద్దులో 2020లో జరిగిన గల్వాన్ లోయ సంఘటన ఆధారంగా ఈ మూవీ వస్తోంది. తాజాగా ఈ మూవీ టీజర్‌కు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ టీజర్‌ను డిసెంబర్ 27న లాంచ్ చేయనున్నట్టు బీటౌన్ సర్కిల్ టాక్. ఈ మూవీలో సల్మాన్ ఖాన్ తెలంగాణకు చెందిన వీర సైనికుడు, గల్వాన్ వీరుడు కల్నల్ సంతోష్ బాబు పాత్రలో కనిపించబోతున్నట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. కాగా దీనిపై మేకర్స్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. సల్మాన్ ఖాన్, చిత్రాంగద సింగ్ కాంబోలో వస్తోన్న తొలి సినిమా ఇది.

# మాస్ మహారాజాతో రొమాన్స్..




ప్రస్తుతం ఆ ముద్దుగుమ్మ టాలీవుడ్ మాస్ మహారాజా సరసన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలో నటిస్తోంది. 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెకు ఏజ్ గ్యాప్ గురించి ప్రశ్న ఎదురైంది. ఈ చిత్ర కథానాయకుడి వయసు 57 ఏళ్లు కాగా, ఆమె వయసు కేవలం 29 ఏళ్లు. దాదాపు 30 ఏళ్ల వయసు తేడా ఉన్న హీరోలతో రొమాన్స్ చేయడంపై నెటిజన్లు నెగటివ్ కామెంట్స్ చేస్తున్నారు. దీనిపై స్పందిస్తూ.. "నేను ఒక నటిగా నా పాత్రకు ఎంతవరకు న్యాయం చేస్తున్నాను అనేదే చూస్తాను. సినిమా యంగ్ హీరోదా లేక సీనియర్ హీరోదా అనేది ముఖ్యం కాదు" అని ఆమె కుండబద్దలు కొట్టింది. గతంలో కింగ్ నాగార్జున సరసన 'నా సామిరంగ' సినిమాలో నటించి మెప్పించిన ఈ భామ, అప్పటి నుంచి సీనియర్ హీరోలకే ప్రాధాన్యత ఇస్తోందనే ముద్ర పడింది. దీనిపై ఆమె క్లారిటీ ఇస్తూ.. "నాగార్జున వంటి పెద్ద నటులతో పనిచేయడం నా అదృష్టం. ఆయన సెట్స్‌లో చూపించే ఎనర్జీ, డెడికేషన్ చూసి నేను షాక్ అయ్యాను. సీనియర్ హీరోలతో పనిచేస్తే కెరీర్‌కు సంబంధించి ఎన్నో కొత్త విషయాలను నేర్చుకోవచ్చు. వారి అనుభవం మనకు పాఠంలా పని చేస్తుంది" అని కొనియాడింది. కేవలం గ్లామర్ పాత్రలకే కాకుండా, నటనకు స్కోప్ ఉన్న పాత్రలకే తాను ఓటు వేస్తానని ఆమె తెలిపింది.

# వృషభ విజువల్ వండర్



కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్ నటించిన ప్రతిష్టాత్మక పానిండియా చిత్రం 'వృషభ'. నందకిశోర్ దర్శకుడు. శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్‌సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా నిర్మాతలు. ఈ నెల 25న గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం తెలుగులో గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ చిత్ర పంపిణీదారుడు బన్నీవాస్ మాట్లాడుతూ ''వృషభ ఓ విజువల్ వండర్. కింగ్ ఎపిసోడ్ వచ్చినప్పట్నుంచీ సినిమా మరోస్థాయికి వెళ్తుంది. ఓ 45 నిమిషాల ఫుటేజ్ చూశాను. నిజంగా చాలా బావుంది. దర్శకుడు నందకిశోర్ గ్రాండియర్‌గా సినిమాను మలిచారు. మోహన్‌లాల్ నట విశ్వరూపం ఈ సినిమా. 'ఆయ్', 'క' సినిమాలతో విజయాలను అందుకున్న నయన్‌సారిక ఈ సినిమాతో హ్యాట్రిక్ అందుకోవాలి. పనిచేసిన అందరికీ మంచిపేరు తెచ్చే సినిమా ఇది.' అని తెలిపారు. తెలుగు తెరకు పరిచయం అవుతున్నందుకు హీరో సమర్జీత్ లంకేశ్ ఆనందం వెలిబుచ్చారు. మోహన్‌లాల్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు కథానాయిక నయన్ సారిక. అలీ, బలగం సంజయ్ కూడా మాట్లాడారు.

# బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్' సునామీ.. అవతార్ 3ను మించి మరీ వెయ్యి కోట్ల దిశగా..





రణ్‌వీర్ సింగ్ హీరోగా, 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' ఫేమ్ ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. జియో స్టూడియోస్ సమర్పణలో B62 స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా సుమారు రూ.280 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కగా, విడుదలైన నాటి నుంచి అంచనాలను మించి వసూళ్లు సాధిస్తూ బాలీవుడ్ రికార్డులను తిరగ రాస్తోంది. డిసెంబర్ 5న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం 17వ రోజు ఆదివారం ఇండియాలో రూ.38.5 కోట్ల వసూళ్లు రాబట్టి మరోసారి తన సత్తా చాటింది. దీంతో మొత్తం ఇండియా కలెక్షన్లు రూ.566.75 కోట్లకు చేరగా, ప్రపంచ వ్యాప్తంగా రూ.852.75 కోట్ల గ్రాస్‌ను సాధించి 'యానిమల్' మూవీ రికార్డును బ్రేక్ చేసింది. ముఖ్యంగా అదే రోజు అవతార్ 3 ఇండియాలో రూ.25 కోట్లు మాత్రమే వసూలు చేయగా, 'ధురంధర్' దాన్ని అధిగమించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ ఏడాది భారీ హిట్‌లుగా నిలిచిన 'ఛావా', 'కాంతారా చాప్టర్ 1' వంటి చిత్రాల రికార్డులను కూడా ఒక్కొక్కటిగా బద్దలు కొడుతూ, ఈ ఏడాది అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా 'ధురంధర్' నిలిచింది. సినిమాలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో నటించడంతో కథకు మరింత బలం చేకూరింది. శక్తివంతమైన కథనం, ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు, ఆదిత్య ధర్ మార్క్ దర్శకత్వం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో కలెక్షన్లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇదే జోరు కొనసాగితే 'ధురంధర్' త్వరలోనే వెయ్యి కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం ఖాయమని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఈ సినిమాపై అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించడం, మరోవైపు మౌత్ టాక్‌తో ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**